# ధృతరాష్ట్రపతి పాలన



# ఇది మృణాళిని కథ

దుర్యోధన్ కొలువు తీర్చిఉన్నాడు. అతనికి ఎడమ వైపు దుశ్శాసన్ కుడివైపు కర్ణ్ కూర్చుని ఉన్నారు. అధికార పక్షమైన తక్కిన 98 మంది తమ్ముళ్ళు, కుషన్ కుర్చీల్లో కూర్చున్నారు. ప్రతిపక్ష నాయకుడు ధర్మరాజుకు మాత్రం గాడ్రేజ్ కుర్చీ వేసి, అతని తమ్ముళ్ళను ఇతర బలగానికి బెంచీలు వేశారు. భీమసేన్ కూర్చో గానే బెంచీ విరగటం వల్లఅతనికి ఈజీ ఛైరు వేశారు. అదీ విరగడంతోఒక అరుగు నిర్మించి దాని మీద కూర్చోమన్నారు. వయో వృద్ధులైన కారణంగా శాసన సభ్యత్వం కోల్పోయిన భీష్మ, ద్రోణ్, కృపాచార్య, అశ్వత్థామలను గ్యాలరీలో కూర్చుని ఊరికే సభాకార్యక్రమాలను చూడమన్నారు. కానీఅశ్వత్థామ తను చిరంజీవిని కనక తనకు వయసు లేదనివాదించి స్పీకర్‌గా కూర్చున్నాడు.

అశ్వత్థామ స్పీకరైతే తన శాసన సభ్యత్వానికి రాజీనామా చేస్తానని కర్ణ్ ప్రతిజ్ఞ చేశాడు. దుర్యోధన్ ఎలాగో కర్ణ్‌ని సముదాయించి ఊరుకో బెట్టాడు. డిప్యూటి స్పీకర్‌గా శకుని కూర్చున్నాడు.

ద్వాపరయుగంలో ఎన్నికలు లేవు. ఎవరు ఏ రోజుముందు వచ్చి ఏ కుర్చీలో కూర్చుంటే అదే దక్కుడు. పాండవుల మాత్రం ఎంత పొద్దున్నే లేచినా మార్షల్స్ లోపలికి రానీరు కనుక వాళ్ళు తెల్లవారుఝామున నిద్ర లేవడం మానేశారు.

ఈ రోజు దుర్యోధన్ చాలా ఆనందంగా ఉన్నాడు. ఇవాళ తను ప్రవేశపెట్టబోతున్న బిల్లు వల్ల దేశం మొత్తంలోజూదం ఆడే హక్కు కౌరవ పార్టీకే ఉంటుంది. వాళ్ళు ఎవర్ని ఆటకు పిలిస్తే వాళ్ళు ఆడితీరాల్సిందే. అంతే కాదు, విధిగాఓడిపోవాలి.

దుర్యోధన్ కనుసైగతోదుశ్శాసన్ లేచి బిల్లులోని ముఖ్యాంశాలు చదివాడు.

"ఇంత వరకు ఏదేశంలోనూ ప్రవేశపెట్టని అసాధారణమైన బిల్లు ఇది. రాజ్యంలోజూదం విచ్చలవిడిగా పెరిగిపోతూ, ప్రజాబాహుళ్యాన్ని వ్యసనపరులుగా మార్చేస్తోంది. దీనితో కళవళ పడిన మా అన్నగారు...అదే మన నాయకుడు దుర్యోధన్ గారు ఈ అద్భుతమైన ఆలోచన చేశారు. ఇక నుంచి కౌరవ పార్టీకి మాత్రమే జూదమాడడానికిఅర్హత వుంది. వేరెవరు ఆడినా, భారతీయ శిక్షాస్మృతి క్రింద ఆరు నెలలునుంచి రెండేళ్ళ వరకు జైలు శిక్ష, పదివేల జరమానా చెల్లించాల్సి వుంటుంది. ఇకదీనిపై చర్చ జరిగే అవకాశం తక్కువ కనక, బిల్లును ఆమోదించినట్లు ప్రకటించాలని స్పీకర్ అశ్వత్థామ గారినికోరుతున్నాం",

అర్జున్ లేచి నిలుచున్నాడు. గాండీవం ముందుకురికింది. ధర్మరాజు కుషన్ కుర్చీలోనుంచి లేచి వచ్చి గాండీవం అర్జున చేతినుంచి బయటకు వచ్చేయకుండా పట్టుకున్నాడు.

"శాంతం అర్జున్, శాంతం." అర్జున్ గొంతు సరిచేసుకున్నాడు. ధర్మరాజును మృదువుగాపక్కకు నెట్టి గాండీవం సంధించాడు. స్పీకర్ కాళ్ళ దగ్గర నమస్కార బాణం వేశాడు.

"స్పీకర్ గారు! మీ అనుమతి తో ఈ బిల్లు పై చర్చ ప్రారంభిస్తున్నాను. ఇది చాలా దారుణమైనబిల్లు. మనిషికి అన్నం తినేందు

కు ఆట లాడుకునేందుకు స్వేచ్ఛ ఉన్నప్పుడు అది ప్రజాస్వామ్యమౌతుంది. జూదం ఒక మోదం. దాన్ని ఆడుకునే హక్కు ప్రపంచంలో ఎవరికైనా ఉండి తీరాలి."

కర్ణ్ లేచాడు.

"అర్జున్ గారు మీరు పొరబడుతున్నారు. మీరు ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడుతున్నారు. మనదేశం గురించి మాట్లాడితే మరికొంత సమంజసంగా ఉంటుంది. ఇది దుర్యోధన్ స్వామ్య ప్రభు త్వం. ఆయన చెప్పినట్లు నడుచుకుంటే ఆటోమేటిక్‌గా ప్రజాస్వామ్య మౌతుంది."

అశ్వద్ధామ "ఆర్డర్, ఆర్డర్" అన్నాడు.

"మీరిద్దరు అసలు విషయం వదిలేసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. కర్ణ్ గారు, మీరు ఓర్పు వహించండి. అర్జున్ కానివ్వండి"

కర్ణ్ ఒక్క వుదుటున వచ్చి మైకు పట్టుకున్నాడు.

"ఈ స్పీకర్ అధికార పార్టీ వాడా? కాదా? ఎప్పుడు మల్నే ఓర్పు వహించమంటే వేమసహించను,దుర్యోధన్" అని అరిచాడు.

ధర్మరాజు కర్ణ్ దగ్గరికి వెళ్ళి భుజం తట్టాడు. "శాంతం కర్ణ్, శాంతం. స్పీకర్ ఏ పార్టీవాడు కానక్కర్లేదు"

దుర్యోధన్ హుంకరించాడు. "ధర్మరాజ్, నీకబుర్లు కట్టి పెట్టు. కర్ణ్‌కి బుద్దులు చెప్పడానికి నువ్వెంతవాడివి?"

"ఏవిటోయ్ తెగ వీల్గుతున్నావు? మా అన్నను దుర్భాషలాడతావా?" భీమసేన్ అరుగుమీదనుంచి ఓ దూకు దూకి వేదిక పైకి వచ్చి కర్ణ్ చేతిలోని మైకువిరక్కొట్టేశాడు.

దుర్యోధన్ తన సింహాసనం మీద నుంచి ఓ దూకు దూకి గదను ఎత్తాడు.

గ్యాలరీలోకూర్చున్న ధృతరాష్ట్రకు ఏమి బోధపడలేదు.

"ఏమిటవుతోంది, విదుర్? ఎవరా అరుపులు? ఏమిటో విరిగినట్లున్నాయి? మా దుర్యోధన క్షేమమే కదా?"

"అందరూ క్షేమమే, అన్నగారు. ఇంకెంత సేపు క్షేమంగా వుంటారో తెలియదు కాని .... చూద్దాం" విదుర్ కుతూహలంగా గేలరీ నుంచి చూస్తున్నాడు.

"ఆర్డర్... ఆర్డర్" అశ్వద్ధామ లేచి నించున్నాడు. "మిమ్మల్నందర్నీ పేరు పెట్టి పిలుస్తానంతే. సమంగా చర్చిస్తారా. అందర్నీ వెళ్ళగొట్టనా?"

కాసేపు అందరూ మౌనం వహించారు. నకులు డు లేచి నించున్నాడు.

"అధ్యక్షా! నాదొక సందేహం. ఈ బిల్లులో కౌరవ పక్షం వారు ఎవర్ని జూదానికి పిలిస్తే వారు తప్పక ఆడాలి, పైగా ఓడిపోవాలి అన్నారు కదా. ఓడిపోకపోతే ఏమౌతుంది?"

స్పీకర్ అశ్వద్ధామ దుశ్శాసన్ కేసి చూశాడు. "వ్యసనాల మంత్రి మీరే కదా" అన్నాడు. దుశ్శాసన్ మైకు చేత్తో పట్టుకున్నాడు.

"ఓడిపోకపోతే ఏమౌతుందంటారా? కౌరవ పార్టీ పిలవకుండా జూదమాడ్డం ఎంత నేరమో, ఆడి గెలవడం అంత నేరం. రెండింటికీ జైలు శిక్ష జరిమానా తప్పదు."

ధర్మరాజు లేచి నిలుచున్నాడు. "ఈ బిల్లు ప్రజాస్వామ్యానికే వర్తిస్తుందా? శాసన సభ్యులకుకూడానా?"

దుశ్శాసన్ గంభీరంగా నవ్వాడు.

"శాసనసభ్యులకు ఇంకా ముఖ్యంగా వర్తిస్తుంది. మీరు ప్రజా ప్రతినిధులు కదా మరి..."

అర్జున్ గాండీవం విసిరేసి ముందుకు వచ్చాడు.

"ఇది అన్యాయం. ధర్మరాజుగారి జీవించే హక్కుని మీరు కాలరాస్తు న్నారు. జూదమంటే ఆయనకెంత ప్రియమో ప్రపంచానికి తెలుసు. ఆయన వంటి ప్రజల స్వేచ్ఛను హరించే ఈ బిల్లు పాస్ కావడానికి వీల్లేదు"

అంటూ అంటూ భీమసేన్ కేసి చూశాడు. భీమసేన్ ఖాళీ కుర్చీలు రెండింటిని విసిరాడు. దుర్యోధన్‌కు ఒళ్ళు మండింది.

"నా ప్రజల ధనంతోకొన్న కుర్చీలు. విరగ్గొడతావా?"

అంటూ టేబిల్‌ని భీమసేన్ మీదవిసిరాడు. మరో ఐదు నిమిషాల్లో శాసన సభ కురుక్షేత్ర భూమిగా మారింది.

"అన్నగారు...పోరు బ్రహ్మాండంగా సాగుతోంది. భీమసేన్ ఇప్పటికి నాలుగు....కదా ....కాదు ఆరుమైకులు విరక్కొట్టాడు. దుర్యోధన భీముని కొడుతున్నాడనుకొని ఇద్దరు మార్షల్స్‌ని చావ బాదాడు. వాళ్ళిద్దర్ని తక్కిన మార్షల్స్ స్ట్రెచర్ పైన తీసుకు వెళ్తున్నారు. శకుని, ధర్మరాజు ఓ మూల కుర్చుని పాచికలు ఆడుతున్నారు. ఇంకా బిల్లు పాస్ కాలేదుగా...దీనముండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలని ధర్మరాజు ప్రయత్నం."

విదుర్ ధృతరాష్ట్రకి ఇస్తున్న రన్నింగ్ కామెంటరీని చూపు మందగించిన ద్రోణ్, భీష్మ, కృపాచార్య, కూడా శ్రద్దగా వింటున్నారు.

చెవులు దద్దరిల్లేలా పాలక ప్రతి పక్షాలు చేస్తున్న రంకెలు, చేస్తున్న హింస మధ్య హఠాత్తుగా ఆరువొక్క స్థాయిలో అశరీరవాణి వినిపించింది.

"రాజ్యం లో అరాచకం ప్రబలుతోంది. పాలించవలసిన వారు పీడిస్తు న్నారు. ఈ దుస్థితిని జగన్నాథుడు చూశాడు. ఆగ్రహించాడు. ఈ క్షణం నుంచి దేశంలో రాష్ట్రపతి పాలన విధిస్తున్నట్టు శ్రీ కృష్ణ భగవాన్ ప్రకటించారు."

పాఠకులకో గమనిక :.

శ్రీ సరిత నారాయణ్ రాసిన 'అతడు + ఆమె = మనిషి' సీరియల్‌ను అనివార్య కారణాలవల్ల ప్రచురణను నిలిపివేసిన కారణంగా పాఠకులకు రచయితకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం

— ఎడిటర్